ప్రజాశక్తి
శనివారం 26 అక్టోబర్ 2024
I
అల్లూరి సీతారామరాజు



విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-జి.మాడుగుల: స్థానిక పోలీస్ స్టేషన్ వారి ఆధ్వర్యంలో ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం కార్యక్రమాన్ని 31వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తున్నట్టు జిమాడుగుల ఎస్ఐ షణ్ముఖరావు తెలిపారు. ఇందులో భాగంగా బంధ వీధి, కొత్తూరు, జిమాడుగుల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో అమర వీరుల త్యాగాలపై పిల్లలకు డిబేట్, వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు. బహుమతులను ఎస్సై షణ్ముఖరావు చేతుల మీదుగా అందజేశారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మహిళా పోలీసులు పాల్గొన్నారు.



వ్యాస రచనలు చేస్తున్న విద్యార్థులు

రెండు వేల మెట్రిక్ టన్నుల కాఫీ కొనుగోలు లక్ష్యం

-అరబికా పార్చిమెంటు కాఫీ కిలో ధర రూ.285
-చెర్రీ రూ.150, రొబస్టా రూ.80, కాఫీ పండ్లు రూ.44
- ఐటిడిఎ పిఒ అభిషేక్

ప్రజాశక్తి -పాడేరు:2024-25 ఆర్థిక సంవత్సరంలో చింతపల్లి మాక్స్ సంస్థ ద్వారా 2000 వేల టన్నుల కాఫీ పండ్లను కొనుగోలు చేయడానికి లక్ష్యగా నిర్దేశించామని ఐటిడిఏ పి.ఓ. వి.అభిషేక్ స్పష్టం చేసారు. ప్రతీ మండలానికి నిర్దేశించిన మేరకు కాఫీ పళ్లను సేకరించాలని కాఫీ సిబ్బందికి దిశా నిర్దేం చేసారు. శుక్రవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో కాఫీ అధికారులు, జిసిసి అధికారులు, కాఫీ లైజాన్ వర్కర్లతో కాఫీ సేకరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐటిడిఏ పరిధిలో కాఫీని మరింత అభివృద్ధి చేయడానికి రాష్ట్రముఖ్య మత్రి అండగా ఉంటామని చెప్పారన్నారు. పూర్తిగా పండిన కాఫీ పళ్లను మాత్రమే రైతులు సేకరించే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. బాగా పండిన కాఫీ పళ్లను మాత్రమే స్వీకరిస్తామని, నాణ్యతలు లోపిస్తే తిరిగి వెనక్కి పంపిస్తామన్నారు. మాక్స్ సంస్థ రైతుల సంక్షేమానికి పని చేస్తోందన్నారు. సంస్థకు నష్టం వాటిల్లితే ఉపేక్షించనని చెప్పారు. నూరు శాతం లక్ష్యాలను సాధించిన సిబ్బందికి ప్రోత్సాహకాలను అందిస్తామన్నారు. 85 శాతానికి తక్కువగా కాఫీ పళ్లను సేకరించిన సిబ్బంది నుండి రికవరీ చేస్తామన్నారు. జిసిసి ద్వారా అరబికా పార్చిమెంట్ కాఫీని రూ.285 లకు, అరబికా చెర్రీ రూ.150లు, రొబస్టాను రూ.80 కొనుగోలు చేస్తారన్నారు. ఐటిడి ఏ నుండి కాఫీ పళ్ల రూ.44 లకు కొనుగోలు చేస్తామన్నారు. అనంతరం రైతులకు బోనస్ చెల్లిస్తామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం జి.మాడుగుల, జి.కె వీధి పల్పింగ్ యూనిట్ల నిర్మాణానికి రూ.7 కోట్లు నిధులు మంజూరు చేయడానికి సూత్ర ప్రాయంగా అంగీకరించిందన్నారు. అంచెలంచెలగా ప్రతీ మండలంలో ఒక యూనిట్ నెలకొల్పడానిక జిసిసి ప్రణాళికలు తయారు చేస్తోందన్నారు.అనంతగిరిలో 50 టన్నుల కాఫీ పళ్లు, అరకువేలీ 120, డుంబ్రిగుడ 120, హుకుంపేట 120, పెదబయలు 120, ముంచంగిపుట్టు 100, పాడేరు 250, జి.మాడుగుల 350, చింతపల్లి 400, 2.5. 5 250 టన్నులు,కొయ్యూరు మండలానికి 40 టన్నులు కాఫీ పళు సేకరణ లక్ష్యంగా నిర్దేశించామని చెప్పారు. నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలని ఆదేశించారు. కాఫీ పళు సరఫరా, సేకరణలో సమస్యలుంటే కాల్ సెంటర్కు సమాచారం అందించాలని చెప్పారు. ఐటిడిఏ కాల్ సెంటర్ 08935250833, జిసిసి కాల్ సెంటర్ నెంబరు 7013070990 ఫోన్ నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. ఈ సమావేశంలో ఐటిడి ఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం.వేంకటేశ్వరరావు, కాఫీ బోర్డు ఉప సంచాలకులు సామల రమేష్, ఐటిడిఏ కాఫీ సహాయ సంచాలకులు ఎన్.అశోక్, జిసిసి డి.ఎంలు సింహచలం, దేవరాజ్, కాఫీ విస్తరణాధికారులు అప్పలనాయుడు, శ్రీరామ్మూర్తి, జిసిసి మేనేజర్లు, హార్టీ కల్చర్ కన్సల్టెంట్లు, పీల్డు కన్సల్టెంట్లు, లైజాన్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిఒ అభిషేక్


లాంచీలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

పాపికొండల విహార యాత్రలో జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-దేవీపట్నం

పాపికొండల విహార యాత్రలో జాగ్రత్తలు పాటించాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ సూచించారు. దేవీపట్నం మండలం పి.గొందూరు గ్రామం గండి పోచమ్మ బోటింగ్ పాయింట్ వద్ద సబ్ కలెక్టర్ కల్పశ్రీ గోదావరి నదిలో బోటింగ్ కార్యకలాపాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గండిపోచమ్మ బోటింగ్ పాయింట్ నుండి లాంచీలో దేవీపట్నం వరకు వెళ్లి వచ్చారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ, పోలీస్, అటవీ, అగ్నిమాపక శాఖల అధికారులు పాల్గొన్నారు. మరో వైపు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు రెండు మూడు రోజుల నుండి గండి పోచమ్మ అమ్మవారి దేవస్థానం వద్ద గోదావరి క్రమేపి పెరుగుతోంది.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి హుకుంపేట:మండలంలోని ఆయా పాఠశాలల్లో ప్రభుత్వ జనరల్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ విశ్వమిత్ర. గిరిజన సంక్షేమ శాఖ ఉప డిప్యూటీ డైరెక్టర్ రజినిలు శుక్రవారం పర్యటించారు. ముందుగా సుకూరు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హుకుంపేట బాలురు-01 పాఠశాలలో జరుగుతున్న విద్యా బోధన, పిల్లల ఆరోగ్యంపై ఆరా తీశారు. అనంతరం మండల కేంద్రంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వామిత్ర మాట్లాడుతూ, ఆశ్రమ పాఠశాలలో గజ్జి, తామర, దురదలను నివారించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. గజ్జి, దురద ఉన్న విద్యార్థులు వారానికి ఒక మాత్ర తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఇన్చార్జ్ డిడి రజని మాట్లాడుతూ, విధులకు ఉపాధ్యాయులు సకాలంలో హాజరై మంచి విద్యా బోధన అందించాలన్నారు. విద్యతో పాటు ఆరోగ్యం ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చక్కగా చదవగలరని తెలిపారు.ఈ కార్యక్రమంలో సరోజిని గవర్నమెంట్ జనరల్ జిల్లా ఆస్పత్రి అసోసియేట్ ప్రొఫెసర్లు డి.ఎర్రయ్య, రత్నం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉదయ్ కుమార్, ప్రధానోపా ధ్యాయులు బాలాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పక్కాగా పశుగణన చేయండి

-జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్

ప్రజాశక్తి- పాడేరు: జిల్లాలో పశుగణన పక్కాగా చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో 21వ అఖిల భారత పశుగణన గోడపత్రికలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 25 తేదీ నుండి 2025 ఫిబ్రవరి 28 వరకు పశుగణన జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంటికి వచ్చి విషయ సేకణదారులకు పశువుల సమగ్ర సమాచారాన్ని అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పి ఓ వి. అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు సి.హెచ్. నరసింహులు, ప్రత్యేకాధికారి చంద్రమౌళి నాయక్, సహాయ సంచాలకులు చంద్ర శేఖర్, గణేష్, పశువైద్యాధికారులు సృజన కుమారి, రాజా రవికుమార్ పాల్గొన్నారు.

విఆర్.పురం:మండలంలోని పెద్ద మట్టపల్లి పంచాయతీ వెటర్నరీ ఆసుపత్రి వద్ద జాతీయ పశు గణన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను స్థానిక సర్పంచ్ వెట్టి లక్మి ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేశ్వరి మాట్లాడుతూ పశు గణన వివరాలు నమోదు ప్రక్రియ తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు పద్మారావు, పశువుల ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీనివాస్ విశ్వనాథ్

పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి-మారేడుమిల్లి

గ్రామాలలో పారిశుధ్య నిర్వాహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపిడిఒ శ్రీనివాస్ విశ్వనాథ్ ఆదేశించారు. తన కార్యాలయంలో శుక్రవారం గ్రామ సచివాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో ఎంపిడిఒ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లోరినేషన్ పరీక్ష జరిగిన తర్వాతే ప్రజలకు తాగునీరు అందించాలని సూచించారు. సిబ్బంది సకాలంలో విధులకు రావాలన్నారు. వెల్ఫేర్ సహాయకులు ప్రతి సోమ, గురువారాల్లో విధిగా పాఠశాలలను సందర్శించి టాయిలెట్స్, తాగునీరు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించాలని సూచించారు. జల్ జీవన్ మిషన్ ద్వారా పూర్తికాని పనులు సత్వరమే చేపట్టాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు మంజూరైనా మరుగుదొడ్లు అనుకున్న సమయానికి నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. మహిళా సంఘాలకు కొత్త రుణాలు మంజూరు చేసి వ్యక్తిగత వ్యాపారాలను ప్రోత్సాహించాలని, అదే సమయంలో రుణాల బాకీలు కూడా రికవరీ చెయ్యాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి ఎం రత్నకుమారి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ జి.నారాయణరావు, మండల విస్తరణాధికారి పి.విజయకుమార్, ఏపిఎం సుధాకర్, ఏపిఒ రెడ్డిబాబు తదితరులు పాల్గొన్నారు.

మెనూ అమలులో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

-మండల గిరిజన సంక్షేమ శాఖ అధికారి మల్లికార్జునరావు
-ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:ఈనెల 25న ప్రజాశక్తిలో అటకెక్కిన భోజన మెనూ అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్థానిక మండల గిరిజన సంక్షేమ శాఖ అధికారి మల్లిఖార్జునరావు స్పందించారు. మండలంలోని సొవ్వా గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో ఏటీడబ్ల్యూఒ శుక్రవారం సందర్శించి భోజన మెనూతోపాటు రోజువారి మెనూ అమలు తీరుపై పరిశీలించారు. విద్యార్థులకు పెడుతున్న భోజన మెనూ ఆయన క్షుణ్ణంగా అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న భోజన మెనూలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వ నిభందనల మేరకు విద్యార్థులకు సిద్ధం చేసిన పోషకాహారాన్ని అందించాలన్నారు. ఇప్పటికైన భోజన మెనూ అమలు పక్కగా అమలయ్యేలా చూడాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.


రికార్డులు పరిశీలిస్తున్న మల్లిఖార్జునరావు


మాజీ ఎమ్మెల్యే దేముడుకు నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ మాధవి తదితరులు

చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ

ప్రజాశక్తి-కొయ్యూరు : చింతపల్లి మాజీ ఎమ్మెల్యే గొడ్డేటి దేముడు 9వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన కుమార్తె, అరకు మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి ఆధ్వర్యాన మండలంలోని డౌనూరులో 200 మంది చిరు వ్యాపారులకు శుక్రవారం గొడుగులు పంపిణీ చేశారు. ముందుగా దేముడు చిత్రపటానికి మాధవి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి వారా నూకరాజు, ఎంపీటీసీ బిడిజన అప్పారావు, డౌనూరు సర్పంచ్ పొట్టిక భవాని, మర్రిపాలెం సర్పంచ్ వెంకటలక్ష్మి, పెట్ల గాంధీ, నేను సైతం చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుసిరెడ్డి శివప్రసాద్, డైరెక్టర్ సురేష్ పట్నాయక్ పాల్గొన్నారు.


పిఒకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

మహిళా సెక్యూరిటీ గార్డులను రెన్యువల్ చేయాలి

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటీడీఏ పరిధిలో గురుకులం, ఏకలవ్య పాఠశాల కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఆదివాసీ మహిళా సెక్యూరిటీ గార్డులను 2025 జనవరి నుండి రెన్యువల్ చేయాలని ఇతర సమస్యలు పరిష్కారం చేయాలని పాడేరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అభిషేక్ కు శుక్రవారం ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో మహిళలు వినతి పత్రం అందజేశారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ, పాడేరు ఐటీడీఏ పరిధిలో 20 గురుకులం, ఏకలవ్య పాఠశాల కళాశాలల్లో ఆదివాసీ మహిళా సెక్యూరిటీ గార్డులు పనిచేస్తున్నారన్నారు. వీరికి 2025 జనవరి నుండి రెన్యువల్ చేయాలని, మూడునెలల బకాయి వేతనాలు చెల్లించాలని పాఠశాల కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న పనిప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని యూనిఫారం బూట్లు టోపీలు టార్చ్ లైట్లు లాఠీ రక్షణ పరికరాలు పంపిణీ చేయాలని కలెక్టర్ గెజిట్ ప్రకారం జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ మహిళా సెక్యూరిటీ గార్డుల అధ్యక్షులు ఎం.ప్రశాంతి, కె.నాగమణి, కె మమత ఎం.సింహాచలం, పి.రాజేశ్వరి, ఎస్.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న పిఓ

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి-హుకుంపేట:పెదగరు ఐసిడిఎస్ శాఖ ఆధ్వర్యంలో పలు పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు సమావేశం ఏర్పాటు చేసి బాల్య వివాహాల నిర్మూలనకు అవగాహన కల్పించారు. అనంతరం ఐసిడిఎస్ శాఖ సిడిపిఓ సిహెచ్ బాలమణి దేవి మాట్లాడుతూ, మంచిగా విద్యను అభ్యసిస్తూ విద్యార్థులు జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. బాల్య వివాహాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రధానోపాధ్యాయులు కె.కొండమ్మ పాల్గొన్నారు.

స్త్రీ నిధి రుణాల పంపిణీ

ప్రజాశక్తి-పాడేరు: స్త్రీనిధి రుణాలు సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ సూచించారు. శుక్రవారం ఐటిడిఏ సమావేశమందిరంలో 39 మంది లబ్ధదారులకు రు.39 లక్షల చెక్కును పంపిణీ చేశారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ, ఏ విధమైన వ్యాపారాలు నిర్వహిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పిఓ వి.అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డిఆర్డిఏ పిడి వి.మురళి, వెలుగు సిబ్బంది, పలువురు మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలి

ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం ఆదేశం

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని వివిధ శాఖలకు సంబంధించిన అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులను రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం ఆదేశించారు. స్థానిక ఐటిడిఎ కార్యాలయంలోని తన చాంబర్లో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం పిఒ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ద్వారా చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఎన్ఆర్ఇజిఎస్, నాబార్డ్ ద్వారా ఇప్పటివరకు ఎన్ని పనులు మంజూరు చేసిందీ, ఎన్ని రోడ్డు పనులు ప్రారంభించిందీ, ఎన్ని పనులు పూర్తి చేసింది ఆరా తీశారు. ఫారెస్ట్ క్లియరెన్స్ కోసం ఎన్ని రోడ్లు పెండింగ్లో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ఐటీడీఏ ఉద్యానవన శాఖ ద్వారా ఇప్పటివరకు గిరిజన రైతులకు ఏ మొక్కలు ఎన్నెన్ని సరఫరా చేశారు, ఎన్ని ఎకరాలలో రబ్బర్ ప్లాంటేషన్ వేస్తున్నారో ఆరా తీశారు. వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ఏజెన్సీలో సికెల్ సెల్ ఎనీమియా వ్యాధిగ్రస్తులకు హెల్త్ కార్డులు ఎంతమందికి జారీ చేశారు, ఎంతమందికి టీబి పరీక్షలు చేసి ఎంతమందిని గుర్తించారు, విద్యార్థులకు నెల నెల వైద్య పరీక్షలు ఆరు నెలల్లో ఎంత మందికి చేసింది, ఆస్పత్రులలో ఎంతమంది గర్భిణీ స్త్రీలకు డెలివరీలు చేసిందీ ఆరా తీశారు.

ఐసిడిఎస్ ద్వారా అంగన్వాడి కేంద్రాలలో బాల బాలికలకు, గర్భిణీ స్త్రీలకు పౌష్టిక ఆహారం అందుతున్నదీని లేనిదీ అడిగి తెలుసుకున్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మెనూ పక్కాగా అమలు చేయాలన్నారు. స్పెషల్ మైనర్ ఇరిగేషన్ ద్వారా ఎన్ని పనులు గుర్తించింది, వ్యవసాయ శాఖ ద్వారా ఎంతమంది గిరిజన రైతులకు ఇ క్రాపింగ్ బుకింగ్ చేసింది ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో జనరల్ డివిఎస్ రమణ, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి, ఎస్ఓ మార్తమ్మ, సిడిపిఓ సంధ్యారాణి, పిహెచ్ఓ చిట్టిబాబు, పివో రాంబాబు, ఏడిఏలు సిహెచ్‌కెవి చౌదరి, కే.సావిత్రి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రవికుమార్, సుబ్బయ్య, డిఇలు చైతన్య, శ్రీనివాసరావు, రాజేంద్ర బాబు, సూపరింటెండెంట్ బి. కిషోర్, వెలుగు ఏపిడి దేగలయ్య, యాంకర్ పర్సన్ రామరాజు, ఏఈలు, జేఈలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

బలిమెల నీటి వినియోగంపై సమీక్ష

ప్రజాశక్తి-సీలేరు

ఆంధ్ర ఒరిస్సా ఉమ్మడి నిర్వహణలో గల బలిమెల జలాశయం నీటి వినియోగంపై శుక్రవారం ఒడిశా రాష్ట్రం బలిమెల ఓహెచ్‌పీసీ కార్యాలయంలో ఇరు రాష్ట్రాల అధికారులు శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏ రాష్ట్రం ఎంతెంత నీటిని వినియోగించుకున్నాయో లెక్కలు కట్టారు. 2024 -25 నీటి సంవత్సరంలో జూలై ఒకటి నుంచి సెప్టెంబర్ నెలాఖరు నాటికి ఆంధ్ర తన వాటాగా 13.0705 టిఎంసిలు నీటిని, ఒడిస్సా తన వాటాగా 28.7534 టీఎంసీలు నీటిని వినియోగించుకున్నట్టు నిర్ధారించారు. దీని ప్రకారం ఒడిస్సా ఆంధ్ర కంటే 15.6829 టీఎంసీలు నీటిని అధికంగా వినియోగించుకున్నట్లు లెక్కలు తేల్చారు. ప్రస్తుతం బలిమెల, జోలాపుట్‌లో కలిసి 119.3150 టీఎంసీలు నీటి నిల్వలు ఉన్నాయని, ఇందులో ఆంధ్రాకు 67.4990 టీఎంసీలు, ఒడిస్సాకు 51.8160 టిఎంసిలుగా పంపకాలు జరిపారు. ఇరు రాష్ట్రాలకు విద్యుత్, ఇరిగేషన్ అవసరాలు నిమిత్తంగా ఆంధ్రకు 3,500 క్యూసెక్కులు నీటిని, ఒడిస్సాకు 5,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడానికి ఇరు రాష్ట్రాల అధికారులు అంగీకరించారు. ఈ కార్యక్రమంలో ఒడిశా తరపున బలిమెల సీనియర్ మేనేజర్ ఎస్.శివప్రసాదరావు, జనరల్ మేనేజర్ కృపాసింధు బిశ్వాల్, డిప్యూటీ జనరల్ మేనేజర్ జ్యోతిర్మయి దాస్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఓం ప్రకాష్ నాయక్, ఆంధ్రా తరపున సీలేరు కాంప్లెక్స్ ఏపీ జెన్కో ఎస్ఈ కే.రామభద్రరాజు, ఈఈలు ఎం శ్రీనివాసరెడ్డి, వి.రాజేంద్రప్రసాద్, ఏఈఈ సిహెచ్ సురేష్ పాల్గొన్నారు.


సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల అధికారులు

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందిస్తున్న సిఐటియు, పెయింటర్ సంఘం నాయకులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అరకువేలి సి కాలనీకు చెందిన పెయింటర్ కొర్ర శ్రీను అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. శ్రీను కుటుంబానికి తేజావలి పెయింటర్ అసోసియేషన్ (సిఐటియు) 10 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమావంంంంంయిహేశ్వరరావు, యూనియన్ అధ్యక్షులు కొండలరావు కార్యదర్శి దాసు, గోపి, రాజేంద్ర సుంకరమెట్ట సర్పంచ్ చిన్నబాబు చేతుల మీదుగా అందించారు.ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, సిఐటియు భవన నిర్మాణ రంగంలో శ్రీను చురుకుగా పనిచేశారని, కరోనా సమయంలో ప్రజలను చైతన్యం చేయడంలోనూ సహకారం అందించడంలోని ముందుండేవారని తెలిపారు. ఆయన మరణం తీరని లోటున్నారు. వారి కుటుంబానికి సంఘంతో పాటు సిఐటియు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వీర్రాజు, సుధా, అప్పారావు, తదితరులు సభ్యులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి



విజయభారతి

ప్రజాశక్తి - చింతపల్లి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థిని, విద్యార్థులు ఆంధ్ర యూనివర్సిటీ వెబ్సైట్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కళాశాల ప్రధానాచార్యురాలు డాక్టర్ ఎం విజయభారతి సూచించారు.. శుక్రవారం ఆమె మాట్లాడుతూ, కళాశాలలో చేరిన విద్యార్థిని, విద్యార్థులు ప్రతి (మొదటి, ద్వితీయ, తృతీయ) ఆంధ్ర యూనివర్సిటీ వెబ్సైట్లో పేరు నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు. ఇప్పటివరకు 90 శాతం మంది విద్యార్థులు పేరు నమోదు (రిజిస్ట్రేషన్) పూర్తి అయిందని మిగిలిన10 శాతం విద్యార్థులు పేరు నమోదు (రిజిస్ట్రేషన్) చేసుకోవాలని ఆమె తెలిపారు. పేరు నమోదుకు ఈనెల 27 ఆఖరు తేదీ నిర్ణయించడం జరిగిందన్నారు. లేని పక్షంలో వారు పరీక్ష ఫీజు చెల్లించేందుకు, పరీక్షకు హాజరు అయ్యేందుకు అనర్హులవుతారన్నారు

చెత్తా చెదారం తొలగింపు



శుభ్రం చేస్తున్న సర్పంచ్, ఉద్యోగులు

ప్రజాశక్తి- పెదబయలు: మండల కేంద్రం సీతగుంట లో శ్రమదానంతో చెత్త చెదారం తొలగించి పరి శుభ్రం చేసినట్లు స్థానిక సర్పంచ్ పి మాధవరావు శుక్రవారం విలేఖరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఎల్.పూర్ణయ్య. మండల ఎంపిటిసిల ఫోరం అధ్యక్షుడు కె బొంజూబాబు, ఉప సర్పంచ్ గంగాధరం, వార్డు సభ్యుడు వెంకటరావు, వీఆర్ఓ ఆజాద్, సర్వేయర్ నాగేశ్వర్‌రావు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు

24 గంటల్లో అర్జీలు పరిశీలించకుంటే చర్యలు

కలెక్టర్ దినేష్ కుమార్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు:అర్జీదారుల నుండి స్వీకరించిన వినతులను శాఖాధికారులు ఇరవై నాలుగు గంటల్లో వెబ్సైట్లో పరిశీలించక పోతే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ హెచ్చరించారు. సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన మీకోసం ప్రజా సమస్యలు పరిష్కార వేధికలో 166 ఫిర్యాదులను స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ్, ఐటిడిఏ పిఓ వి.అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్‌తో కలిసి వివిద మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. సమస్యలను పరిష్కరించడానికి సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారుల వినతుల పరిశీలన చేయకపోతే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామన్నారు. ఫిర్యాదులు పరిష్కారానికి అధికారులు జవాబుదారీగా ఉండాలన్నారు. రహదారుల నిర్మాణాలు, సిసి రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సమస్యలు, అటవీ హక్కు పత్రాలు, ఉపాధి అవకాశాల కోసం ఎక్కువగా ఫిర్యాదు అందాయి.
చింతపల్లి మండలం బెన్నవరం గ్రామానికి చెందిన గోమంగి సుబ్బారావు, పాంగి రాజారావు తదితర 40 మంది గిరిజన రైతులు అటవీ హక్కు పత్రాలు మంజూరు చేయాలని కోరారు. పాడేరు మండలం కించూరు పంచాయతీ సంర్పంచ్ వంతాల రాంబాబు గొండెలి గ్రామం నుండి వయా కించూరు మీదగా పెదకోడాపల్లి వరకు బిటి రోడ్డు నిర్మించాలని వినతిపత్రం సమర్పించారు. జి.కె. వీధి మండలం దారుకొండ పంచాయతీ దారపురం గ్రామస్తులు కె. బింగు, జి. కేశవరావు, పి.టిమురు దారపురం గ్రామానికి రోడ్డు నిర్మించాలని దరఖాస్తును అందజేసారు. కొయ్యూరు మండలం నడింపాలెం పంచాయతీ గాంకొండ గ్రామస్తులు నడిపాలెం మెయిన్ రోడ్డు నుండి గాంకొండ గ్రామం వరకు బి.టి.రోడ్డు నిర్మించాలని కోరారు. ముంచంగిపుట్టు మండలం కించాయిపుట్టు పంచాయతీ తేనెల మామిడి గ్రామస్తులు బరడ పి. ఆర్. రోడ్డు తేనెల మామిడి గ్రామానికి రోడ్డు నిర్మించాలని బి.తిరుపతి , ఎం.సత్తిబాబు వినతిపత్రం సమర్పించారు.చింతపల్లి మండల కేంద్రానికి చెందిన కోమర్తి లక్ష్మణరావు అనే దివ్యాంగుడు మూడు చక్రాల బ్యాటరీతో నడిచే మోటారు సైకిలు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేసారు.ఈ కార్యక్రమంలో డి. ఆర్. ఓ. ఎం. పద్మావతి, డి.ఆర్.డి.ఏ .పి.డి. వి. మురళి, గిరిజన సంక్షేమ శాఖ ఇన్చార్జి ఉప సంచాలకులు ఎల్.రజని, గిరిజన సంక్షేమ శాఖ ఇ ఇలు జి.డేవిడ్ రాజు, కె.వేణుగోపాల్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జమాల్ భాషా, రహదారులు భవనాల శాఖ ఇఇ బాల సుందరబాబు వివిద శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆహ్లాదకర వాతావరణంలో ఇంగ్లీష్ మీడియం స్కూల్



పూల మొక్కలను పరిశీలిస్తున్న హెచ్ఎం, వార్డెన్

ప్రజాశక్తి-హుకుంపేట: స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఇంగ్లీష్ మీడియం బాలికలు పాఠశాల మొక్కలతో ఆహ్లాదకరంగా దర్శనమిస్తోంది. పూల, కూరగాయల మొక్కలు నాటారు. పిల్లలతో పాటు వార్డెన్ సొరవతో రకరకాల పూల మొక్కలు కూరగాయ అరటి మొక్కలు నాటించారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు మీనా కుమారి మాట్లాడుతూ, మంచి వాతావరణం ఉంటేనే విద్యార్థులు మంచిగా చదవగలుగుతారని అన్నారు. పూల మొక్కలు నాటడం ద్వారా మంచి సువాసన సుగంధము ఇస్తుందన్నారు. విద్యార్థులు చదువులపై పాఠశాల ప్రాంగణం మంచి అనుభూతిని ఇస్తుందన్నారు. విద్యార్థులు పాటు స్థానిక వార్డెన్ సుహాసిని కృషితో పాఠశాల అందంగా మార్చారన్నారు. ఆమె వెంట వార్డెన్ సుహాసిని, ఉపాధ్యాయులు లంబన్న పాల్గొన్నారు.

ఎయులో డ్యూయల్ డిగ్రీ కోర్సులు

- బిటెక్‌లో విఎల్ఎస్ఐ కోర్సు : ఎం.టెక్‌లో సిగ్నల్ ప్రోససింగ్ కోర్సు

- సమాజ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కోర్సుల్లో మార్పులు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఆంధ్రవిశ్వవిద్యాలయంలో డ్యూయల్ డిగ్రీ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు విసి ఆచార్య జి.శశిభూషణ రావు అన్నారు. శుక్రవారం నిర్వహించిన వార్షిక బోర్డ్ ఆఫ్ స్టడీస్ సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా డ్యూయల్ డిగ్రీ కోర్సులను ప్రతిపాదించామన్నారు.బిటెక్‌లో విఎల్ఎస్ఐ, ఎంటెక్‌లో సిగ్నల్ ప్రోససింగ్ కోర్సులను ప్రారంభిస్తామన్నారు. 2018 నుంచి ఎయులో చదివి అనివార్య కారణాల వలన మిడ్, ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కాలేని, పరీక్ష తప్పిన విద్యార్థులకు రీ ఎగ్జామినేషన్స్ నిర్వహించాలని నిర్ణయించారు. సమాజ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కోర్సుల్లో అవసరమైన మార్పులు చేయాలని సూచించారు. అనంతరం విభాగాలలో బిఓఎస్ సమావేశాలు నిర్వహించారు.
కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయరావు, అకడమిక్ డీన్ ఆచార్య కె.ఈశ్వర్‌కుమార్, ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎ.నరసింహరావు, జి.గిరిజాశంకర్, కె.సీతా మాణిక్యం, ఆచార్య ఆర్.పద్మశ్రీ, ఆచార్య డి.నాగరాజ కుమారి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు శంకుస్థాపన



అనంతగిరిలో గృహాలకు శంకుస్థాపన చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి -అనంతగిరి:జన్ మన్ పథకం కింద మంజూరైన హౌసింగ్ గృహాలు త్వరితగతిన పూర్తి చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కుమార్ సూచించారు. శుక్రవారం కాశీపట్నం పంచాయతీ పాలంవలస గ్రామంలో 13 మంది లబ్ధిదారులకు మంజూరైన హౌసింగ్ గృహాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,కేంద్ర ప్రభుత్వం ఒక్కొక్క లబ్దిదానికి రెండు లక్షల 39 వేల నిధులను మంజూరు చేసిందని, దశలవారీగా పనులు చేపడితే వారి ఖాతాలో ప్రేమెంట్లు జమ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ శాఖ అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.
చింతపల్లి : పీ.ఎం .జన్మన్ గృహ నిర్మాణ పథకం పీవీటిజిలకు వరమని తెదేపా క్లస్టర్ ఇంచార్జ్ వంతల భీమన్న అన్నారు. తమ్మంగుల పంచాయతీ వర్తనపల్లి గ్రామంలో గృహ నిర్మాణ శాఖ ఏఈ కె.రమణ బాబుతో కలసి వర్తనపల్లి గ్రామంలో పివిటిజిలతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ, తమ్మంగుల పంచాయితీలో పీఎం జన్మన్ గృహలు 126 మంజూరు అయ్యాయని, వాటిలో 50 బేస్మెంట్, 8 లింటల్ స్థాయిలోనూ ఉన్నాయన్నారు. ఈ పథకం ద్వారా పి.వి టి.జి.లకు సొంతింటి కల నెరవేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గృహ లబ్ధిదారులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో పిచ్చి మొక్కల తొలగింపు



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి పాడేరు :జాతీయ స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మినుములూరులో ఉన్న కలుపు మొక్కలను తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సి. జమాల్ బాషా మాట్లాడుతూ, వైద్య సిబ్బంది తమ పరిధిలో ఉన్న ఉప కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామాలలో మలేరియా, డెంగ్యూ వ్యాధి వ్యాప్తి చెందకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలలోని ఇండ్లలో ఉన్న ఫ్రిజ్‌లు, వాషింగ్ మిషన్‌లు, డ్రమ్ములు, పాత టైర్లు, పూల కుండీలలో నీరు నిలువ లేకుండా చూడాన్నారు.ప్రతి శుక్రవారం డ్రై డే ఫ్రై డే ను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ,పి. హెచ్.సి వైద్యాధికారి . గోపాలకృష్ణ, ఆరోగ్య విస్తరణ అధికారి గుల్లేలి సింహాద్రి, పర్యవేక్షకులు వి.వరలక్ష్మి, సరోజిని, ఝాన్సీ రాణి పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో డ్రై డే

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని పలు పంచాయతీలలో శుక్రవారం డ్రై డే పరిశుభ్రత పనులు నిర్వహించామని స్థానిక ఎంపీడీవో ఏవివి కుమార్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం పంచాయతీ పరిధి గ్రామాలలో పరిశుభ్రత పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్య అధికారిణి. జ్ఞానేశ్వరి ం పాల్గొన్నారు



గెడ్డను పరిశీలిస్తున్న శివప్రసాద్ తదితరులు

గెడ్డపై తాత్కాలిక కాజ్‌వే నిర్మాణం చేయాలి

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని శరభన్నపాలెం, కేడీపేట మధ్యలో ఉన్న రామరాజుపాలెం గ్రామం దగ్గర గెడ్డ (కాలువ)పై తాత్కాలిక కాజ్‌వే నిర్మాణం చేయాలని నేను సైతం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కుసిరెడ్డి శివప్రసాద్, నడింపాలెం గ్రామస్తులు శామ్యూల్ తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు గెడ్డ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ గెడ్డపై గతంలో ఉన్న బ్రిడ్జిని 516 జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా తొలగించారని, తాత్కాలికంగా వేసి దారి వర్షాలకు కొట్టుకుపోయిందని తెలిపారు. దీంతో శరభన్నపాలెం, పెదవలస, నడిం పాలెం పంచాయతీల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, గర్భిణులు, బాలింతలు, అనారోగ్యానికి గురైన వారిని హాస్పిటల్‌కు తీసుకొచ్చేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జరిగే కృష్ణదేవిపేట వారపు సంతకు రాలేని పరిస్థితి నెలకొందన్నారు. గెడ్డ ఉధృతంగా ప్రవహించినప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇటీవల శరభన్నపాలెం గ్రామానికి చెందిన ఒక యువకుడు గెడ్డలో పడి మృతి చెందాడని పేర్కొన్నారు. పూర్వ బ్రిడ్జిని అలాగే ఉంచి కొత్త బ్రిడ్జిని నిర్మాణం చేయాల్సి ఉండగా, ఉన్న బ్రిడ్జిని తొలగించడం దారుణమన్నారు. దీని వల్ల వర్షాకాలంలో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తాత్కాలిక కాజ్‌వే నిర్మాణం చేయాలని కోరారు.

ఎట్టకేలకు విద్యుత్ సమస్య పరిష్కారం

ప్రజాశక్తి- కూనవరం : మండలంలోని రేగులపాడు పంచాయతీ పరిధి బొజ్జరాయి గూడెం గ్రామంలో ఎట్టకేలకే విద్యుత్ సమస్య పరిష్కారం కావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. రెండు వారాల క్రితం భారీ వర్షానికి బొజ్జరాయిగూడెంలో విద్యుత్ స్తంభాలు నెలకొరిగి కరెంట్ సరఫరా నిలిచిపోయింది. దీంతో 20 కుటుంబాల వారు సుమారుగా 15 రోజుల పాటు అంధకారంలో మగ్గారు. విద్యుత్ శాఖ అధికారులు స్తంబాలు పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. రేగులపాడు సర్పంచ్ ఆదేశాలు మేరకు ఉపసర్పంచ్ నానుపల్లి హరిబాబు దగ్గర ఉండి స్తంభాల పునరుద్ధరణ పనులు పూర్తి చేయించారు.

ఘనంగా పోర్టు ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోర్టు 91వ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పోర్టు పరిపాలనా భవనంలో ఆధునికీకరించిన బోర్డు రూంను చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు చేతుల మీదుగా ప్రారంభించారు. దీనికి వైజాగ్ పటంగా నామకరణం చేశారు. అనంతరం 91వ అవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని పరిపాలనా భవనంలోని సాంబమూర్తి ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంగముత్తు మాట్లాడుతూ పోర్టు ప్రగతిని వివరించారు. గత ఆర్థిక సంవత్సరంలో 81.09 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు రవాణా చేసి నూతన రికార్డును నెలకొల్పిందని, ఈ ఏడాది 90 మిలియన్ మెట్రిక్ టన్నులను లక్ష్యంగా చేసుకుని దానిని సాధించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.

27న బీచ్‌లో లేజర్ షో

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసిలో స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా ఈ నెల 27న సాయంత్రం 7 గంటల నుంచి బీచ్ రోడ్డులోని వైఎంసిఎ సమీపానగల 'విక్టరీ ఎట్ సీ' స్తూపంపై సౌండ్, లేజర్ షో ఉంటుందని జివిఎంసి ప్రధాన ఇంజనీరు పి.శివప్రసాద్ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లేజర్ షోలో 1971 నౌకాదళ యుద్ధం, విశాఖ నగర పాత్ర, యుద్ధ వీరుల సాహసాలతో పాటు దేశ చరిత్రను తెలిపే విధంగా అద్భుతమైన లేజర్ షో ఉంటుందని పేర్కొన్నారు.

తాను మరణించి... ముగ్గురి జీవితాల్లో వెలుగులు నింపి..

సోంపేటకు చెందిన వ్యక్తి బ్రెయిన్‌డెడ్


జీవన్‌దాన్ ద్వారా అవయవాలు వేరొకరికి కేటాయింపు



జగదీష్ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - అరిలోవ : కుటుంబాన్ని పోషించే పెద్ద దిక్కు మరణించి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ కుటుంబం మరో ముగ్గురు జీవితాలకు వెలుగులు నింపేందుకు ముందుకు వచ్చి మనసున్న మంచి మనుషులుగా నిరూపించుకుంది. వివరాల్లోకి వెళ్తే శ్రీకాకుళం జిల్లా సోంపేటకు చెందిన జి.జగదీష్ (41) ఈ నెల 22వ తేదీన ఇంటిలో ఒక్కసారిగా స్పృహ తప్పి పడిపోయాడు. దీంతో అతన్ని వెంటనే స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కి తరలించారు. అక్కడ వైద్యులు అన్ని రకాల పరీక్షలు నిర్వహించగా తలలో తీవ్రంగా రక్త ప్రసరణ జరుగుతున్నట్టు గుర్తించారు. అతన్ని రక్షించడానికి మూడు రోజుల పాటు ఎంతో శ్రమించినప్పటికీ ఎటువంటి ఫలితమూ రాలేదు. దీంతో వైద్య బృందం శుక్రవారం బ్రెయిన్ డెడ్ అయినట్లు కుటుంబానికి తెలియజేసింది. ఆ తర్వాత అవయవదానంపై అదే వైద్య బృందం వారి కుటుంబ సభ్యులు, మృతుని భార్య, కుమారుడు, కుమార్తె, బంధువులకు అవగాహన కల్పించారు. దీంతో అవయవ దానం చేసేందుకు కుటుంబ సభ్యులు అంగీకారం తెలిపారు. ఈ విషయాన్ని రాష్ట్ర జీవన్ దాన్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు దృష్టికి తీసుకెళ్లగా ఆయన జగదీష్ శరీరంలో పనిచేస్తున్న అవయవాలను సేకరించేందుకు అనుమతులు జారీ చేశారు.. ఈ మేరకు జగదీష్ మృతదేహం నుంచి కిడ్నీలు, ఊపిరితిత్తులు తీసి జీవన్‌దాన్ ప్రోటోకాల్ ప్రకారం సీనియార్టీ లిస్ట్ ఆధారంగా ముగ్గురు రోగులకు కేటాయించారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి



మాట్లాడుతున్న డాక్టర్ హిమబిందు

ప్రజాశక్తి-సీలేరు
చిన్నారులకు విధిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని జీకే వీధి మండలం దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డీకే హిమబిందు అన్నారు. హెడ్‌కౌంట్ సర్వే ఆఫ్ రొటీన్ ఇమ్యునైజేషన్ కార్యక్రమంలో భాగంగా ఆశా కార్యకర్తలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ ఐదేళ్ల లోపు చిన్నారులకు క్రమంగా టీకాలు వేయించడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. చిన్నారులకు క్రమం తప్పకుండా వేయించాల్సిన టీకాల ప్రాధాన్యతను తల్లిదండ్రులకు అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు తెలియజేయాలన్నారు. చిన్నారుల్లో వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే ఆసుపత్రికి తీసుకొచ్చి మెరుగైన వైద్యం చేయించాలని ఆదేశించారు. చిన్నారులకు నాటు వైద్యం, పసర మందులు పట్టరాదని, దీని వల్ల చిన్నారుల ప్రాణాలకు పెను ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందన్నారు. వాతావరణ మార్పులు వల్ల గిరిజన గ్రామాల్లో జ్వరాలు, అతిసారా ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఆసుపత్రి పరిసరాలు శుభ్రం చేసిన సిబ్బంది

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది ఆసుపత్రి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ కృష్ణకుమారి, ఎంఎల్‌హెచ్‌పి పాల్గొన్నారు.

గత ప్రభుత్వంలో నాయకులు విశాఖను దోచుకున్నారు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గత వైసిపి ప్రభుత్వంది విధ్వంసకర పాలన అని, ఆ సమయంలో పార్టీ నాయకులు విశాఖను దోచుకున్నారని విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి విమర్శించారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో జరిగిన టిడిపి, జనసేన, బిజెపి జిల్లా విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో జగన్ దుర్మార్గపు పాలనను అంతం చేయడానికి కొందరు నాయకులు త్యాగాలు చేశారని చెప్పారు. ఆ సమయంలో కూటమిలో కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఇవ్వనున్నామన్నారు. విశాఖ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకమైన ఆంధ్ర యూనివర్సిటీలో రాజకీయాలు చేసి భ్రష్టు పట్టించారని ఆరోపించారు. గతంలో విశాఖ నుంచి వెళ్లిపోయిన లులూ మాల్ కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో మరలా తిరిగి వస్తోందని చెప్పారు. జగన్మోహన్ రెడ్డి గత ఐదు సంవత్సరాలలో పంచాయతీలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. సర్పంచుల వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని తెలిపారు. జగన్ గుర్ల వచ్చారని, ఆ పాపం జగన్‌దేనిని ఎద్దేవా చేశారు. తనకు విశాఖతో అనుబంధం ఉందని, తాను ఇక్కడి ఆంధ్ర మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ చదువుకున్నానని ఈ సందర్భంగా మంత్రి గుర్తుచేసుకున్నారు.

విజయసాయి దోపిడీదారుడు : పల్లా

వైసిపి రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి పెద్ద దోపిడీదారుడని, ఆయన మళ్లీ విశాఖపట్నం వచ్చారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆరోపించారు. ఢిల్లీ నడివీధులలో తమ వల్ల చేతకాదని చెప్పిన వ్యక్తి ఇప్పుడు స్టీల్‌ప్లాంట్ కోసం నిరాహార దీక్ష చేస్తామని అంటున్నారని ఎద్దేవా చేశారు. వైసిపి నాయకుల కల్లబొల్లి మాటలను ప్రజలు నమ్మరన్నారు. విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత విశాఖకు టిసిఎస్‌ను తీసుకువచ్చామన్నారు.

విశాఖలో రాత్రి 12 గంటలు వరకు హోటల్స్ తెరిచి ఉండేలా అనుమతులు తెచ్చామన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, పి.గణబాబు, పంచకర్ల రమేష్‌బాబు, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు, రాష్ట్ర అర్బన్ డెవలప్‌మెంట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, సీతంరాజు సుధాకర్, జనసేన నాయకులు పసుపులేటి ఉషాకిరణ్ పాల్గొన్నారు.



వై.రామవరం మండలంలో పరిసరాలను శుభ్రపరుస్తున్న సిబ్బంది

పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి-సీలేరు : పరిసరాల పరిశుభ్రతలో అందరూ భాగస్వాములు కావాలని జికె.వీధి సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, దామనాపల్లి సర్పంచ్ కొందేటి రామకృష్ణ పిలుపునిచ్చారు. జీకే వీధి మండలం దామనాపల్లి పంచాయతీ దొడ్డికొండ గ్రామంలో సచివాలయ సిబ్బంది గ్రామస్తులతో కలిసి శుక్రవారం ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వ:హించారు. దొడ్డికొండ వెళ్లే రహదారికి ఇరువైపులా తుప్పలు తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రామకృష్ణ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఎటువంటి రోగాలు సంభవించవని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గన్నెల చిలకమ్మ, వైసిపి నాయకులు వంతల చిట్టిబాబు, సచివాలయ సిబ్బంది శేఖర్, బాలయ్య, పాత్రుడు, యుగంధర్, భారతి, బుజ్జిబాబు, విఆర్పి సత్తిబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.
కొయ్యూరు : మండలంలోని రావణాపల్లి గ్రామంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ ఎస్‌కేవి.ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి, ఏఎన్ఎం సన్యాసమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.
వై.రామవరం : మండలంలోని తోటకూర పాలెం, పసిడిగిన్నె, ఎర్రగొండ గ్రామాల్లో డ్రై డే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బాపన్నదొర మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, మెడికల్, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పామాయిల్ సాగుతో అధిక ఆదాయం

ప్రజాశక్తి-కొయ్యూరు : పామాయిల్ సాగుతో అధిక ఆదాయం పొందవచ్చని కొయ్యూరు మండల ఉద్యానవన అధికారి కంటా బాలకర్ణ పేర్కొన్నారు. మండలంలోని రాజేంద్రపాలెంలో రైతులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. పామాయిల్ సాగుపై అవగాహన కల్పించారు. పామాయిల్ పంటకు తెగుళ్ల బెడద తక్కువ అని, తక్కువ పెట్టుబడితో రైతులకు సంవత్సరమంతా ఆదాయాన్ని ఇచ్చే పంట పామాయిల్ అని పేర్కొన్నారు. పామాయిల్ సాగుకు నిరంతరం ఖచ్చితంగా నీటి సదుపాయం కల్పించాలని సూచించారు.

జిఓ 3ని పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-కూనవరం : 5వ షెడ్యూల్డ్ భూభాగమైన ఏజెన్సీ ప్రాంతాల్లో వందశాతం ఉపాధ్యాయ ఉద్యోగాలు స్థానిక ఆదివాసీలకే కల్పించే జిఓ నెంబర్ 3ని పునరుద్ధరిస్తామని అరకు ఎన్నికల సభలో చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు తక్షణమే జిఓ 3ను పునరుద్ధరించాలని ఎపి ఆదివాసీ జెఎసి రాష్ట్ర కార్యదర్శి కుంజా అనిల్ డిమాండ్ చేశారు. మండలంలోని చిన్నఆర్కూర్‌లో డిఎస్సి అభ్యర్థులతో పాయం వెంకటేష్ అధ్యక్షన శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు 2020లో జీవో 3ను రద్దు చేసిందని, దీంతో నాటి నుండి నేటి వరకు ఆదివాసీలకు ఒక్కరికి ఉద్యోగం రాలేదన్నారు. దీంతో యువత దొంగతనం, గంజాయి వంటి చెడు వ్యసనాలకు లోనై చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీవో 3ను పునరుద్ధరించకుంటే రాష్ట్రంలోని అన్ని ఐటీడీఏలను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బాబురావు మాస్టారు, డిఎస్సి అభ్యర్థులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ జిఓ జారీ చేయాలి

వై.రామవరం : జీవో నెంబర్ 3కి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం మరో జీవోను జారీ చేయాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు తీగల బాబురావు డిమాండ్ చేశారు. వై.రామవరం మండలం సవిటిదిబ్బల గ్రామంలో సంఘం డివిజన్ అధ్యక్షుడు ఎం నూకరాజు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సమావేశం బాబురావు మాట్లాడుతూ ఆదివాసీలకు ప్రాణవాయువు లాంటి జీవో నెంబరు 3ని సుప్రీంకోర్టు కొట్టు వేయడంతో వారి బతుకులు ప్రశ్నార్థకంగా మారాయిని ఆవేదన వ్యక్తం చేశారు.